# ముద్దు

ఎం. ఉమామహేశ్వరరావు

**విచిత్రం!**

**నా మాటకు మూతిని మూడు వంకరలు తిప్పుతూ నా వంక కవ్వింపుగా చూసింది లావణ్య. కొందరాడవాళ్లు కోపంతో మూతి బిగించినా అందంగానే వుంటారు.**

**"ఇదిగో మొద్దూ! ఆలస్యం అయిపోతోంది. నే వెళ్లిపోతున్నా" అంది అక్కణ్నించి కదలబోతూ.**

**"లావణ్యా! ప్లీజ్...!" ఆత్రం ధ్వనించింది నా స్వరంలో.**

ఆగిపోయింది లావణ్య. అందంగా నా వంక చూసింది. ఆమె వంక జాలిగా చూస్తూ, మెల్లగా వచ్చి ఆమె దగ్గరగా నించున్నాను.

"మరీ ముద్దొస్తున్నావోయ్ యీ పోజులో! ప్చ్...! అయినా నేనేం నీ కోరిక తీర్చలేను బాబూ!" అంది మరింత కవ్విస్తూ.

"అదిగో! అలా కవ్విస్తేనే నా గుండె గతి తప్పిపోతోంది లావణ్యా! ప్లీజ్.... ఒక్కసారి...!"

ఆమెకు మరింత దగ్గరగా జరిగి అన్నాను. నా వంక కళ్లు విప్పార్చి మరీ చూసింది. ఆ చూపుల్లో భాషకందని భావం, కవులకు సైతం అలవికాని అర్థాలూ గోచరిస్తున్నాయి.

"చూడవోయ్ శంకరం...!" యేదో చెప్పబోయింది.

కెవ్వుమన్నాను. నిజంగా నా గుండె అదిరిపోయింది. అదర్దూ మరి? చెట్టంత మగాణ్ని. అలాంటిది నన్ను పట్టుకుని పేరు పెట్టి పిలవడమే గాకుండా 'ఓయ్! గీయ్!' అంటుందా? ఆవిడకు కాబోయే మొగుణ్ని అన్న ఆలోచన కూడా లేదా? ఎంత పొగరు! ఆక్రోశిస్తోంది నా మనసు.

"పెద్దలు పెట్టిన ఆ ముహూర్తం నాడు నా మెడలో ఆ మూడు ముళ్లూ నువ్వేసేక, ఆ తరువాత మన మొదటి రాత్రికే అవన్నీనూ! అంత వరకూ 'వెయిట్' చెయ్యాలోయ్! విన్నావా మొద్దూ? మరోసారి ముద్దు గుద్దూ అన్నావంటే వొళ్లు పంబ రేగిపోద్ది తెల్సిందా?!" అంది తర్జని చూపిస్తూ.

హెచ్చరిక...!

ఆహా! హెచ్చరికే! ఇచ్చేసింది లావణ్య. డీలా పడిపోయింది నా మనస్సు. అది యెటో వెళ్లిపోయింది.

మళ్లీ లావణ్యే అంది "ఇక నీతో యిక్కడ మరి కాస్త సేపుంటే నా కొంప మునిగిపోద్ది! అనక అమ్మకు సమాధానం యిచ్చుకోలేక నేను చావాలి!" అంటూ అక్కడి నుంచి వడివడిగా అడుగులు వేసేలోగా "కెవ్!"మంటూ అరిచేను.

ఉలిక్కిపడింది లావణ్య.

"పా... పా... పాము లావణ్యా!" భయంగా వణికిపోతూ చెప్తున్న నన్ను చూసి గాభరా పడిపోయిందామె.

"అమ్మో! పామా?... ఏదీ? ఎక్కడ?" అంటూ విసురుగా పరుగెత్తుకొచ్చి నన్ను చుట్టేసింది రెండు చేతులతోనూ.

ఆ స్పర్శకు వొళ్లంతా జివ్వుమందొక్కసారిగా. మేనూ మేనూ దగ్గరవుతే, అదీ కావలసిన వాళ్లవే అయితే, యెవరూ స్విచ్ వేయకుండానే కరెంటు ప్రవహిస్తుంది. ఆదిగో... అలా వుంది నా పరిస్థితి!

ఆ స్పర్శకు వొళ్లంతా జివ్వుమందొక్కసారిగా. మేనూ మేనూ దగ్గరవుతే, అదీ కావలసిన వాళ్లవే అయితే, యెవరూ స్విచ్ వేయకుండానే కరెంటు ప్రవహిస్తుంది. ఆదిగో.. అలా వుంది నా పరిస్థితి!

రెండు చేతులతోనూ ఆమెను కౌగిలించుకుని, తనివితీరా ఆమె గులాబి రెక్కల్లాంటి పెదవుల మీద "మ్మ్!" అంటూ గాఢమైన ముద్దొకటి యిచ్చుకున్నాను తన్మయత్వంతో.

అంతే...!

లావణ్యలో కోపం కట్టలు తెంచుకుంది. చేయి చాచి నా దవడ పగిలిపోయేలా వొక్కటిచ్చుకుంది.

"నువ్వు మొద్దువే కాదు, బొత్తిగా బుద్ధి లేని యెద్దువు! ఛి..ఛీ! నీలాంటి వాడి దగ్గరకు పిలిచిన వెంటనే రావడం నాదే బుద్ధి తక్కువ!" అంటూ అక్కడి నుంచి వేగంగా తనింటివేపు అడుగులు వేసింది.

రెండు చేతులతోనూ బుగ్గను తడుముకుంటూ అలాగే వుండిపోయేను కాస్సేపు.

000

దుప్పటి కప్పుకుని మంచమ్మీద పడుకున్నానే గాని, నిద్ర రావడం లేదు. మరో పక్క వొళ్లు సలసలా కాగిపోతోంది.

"ఇదెక్కడి మాయదారి జ్వరంరా బాబూ, ఇంత హఠాత్తుగా వచ్చింది! అందుకే అంటాను, 'బయట మంచులో తిరక్కురా, నీ ఆరోగ్యం అసలే మంచిది కాదూ' అని! వింటావు గనకనా?" అంటూ విసుక్కుంటూ యేవో టాబ్లెట్లు యిచ్చింది అమ్మ.

ఆ మాత్రల్ని మింగేనే గాని, లావణ్య కొట్టిన ఆ చెంప దెబ్బకు యిలా జ్వరం వచ్చేస్తుందని నేను మాత్రం కల గన్నానా? అయినా, బాధలోనే ఓ తీయదనం అనుభవిస్తున్నానని అమ్మకెలా చెప్పడం?

కాస్సేపుండి వెళ్లిపోయింది అమ్మ. నెమ్మదిగా నిద్రలోకి జారుతున్నవేళ. నా కళ్ల ముందు లావణ్య. కళ్లతో కవ్విస్తోంది. తేనెలూరుతున్న పెదాలతో గుండెలో సంచలనాన్ని మరింత పెంచుతోంది.

"ప్లీజ్ లావణ్యా!" ఆమె వెంటబడి

నడుస్తున్నాను. విశాలమైన ఆమె కళ్లల్లో కళ్లు కలిపి కవ్విద్దామంటే, అంతలోనే కాళ్లను నేలకు దించి నేల చూపులు చూస్తుంది. పోనీ... ఆమెను కాస్త అలా దగ్గరకు తీసుకుందామనుకుని, దగ్గరికెళ్తే చాలు, గుడ్లురిమి చూస్తుంది. సున్నితంగా ఆమె చేతిని పట్టుకుని ముద్దు పెట్టుకుందామంటే, విసురుగా చేయి విదిలిస్తుంది. అలా విదిలించే వేళ, ఆ చేతి గాజులు చేసే చప్పుడుకు మనస్సు మరింత చెదిరిపోతోంది....


అందుకే యిక ఆగలేకపోయేను. కాబోయే భార్య. మేనమామ కూతురు. నేనెందుకు భయపడాలి? అదే ధైర్యం నాలో. అందుకే పాము అని అరిచి, దగ్గరికొచ్చేక కౌగిలించుకుని ఆ అందాల అధరం మీద ముద్దు పెట్టుకున్నాను. అబ్బ! ఎంత మధురంగా వుందో ఆ ముద్దు!!

ఆమె పెదాల నుంచి జాలువారుతున్న ఆ అమృతధారల్ని కాస్సేపు తనివితీరా గ్రోలాలని తెగించి ముద్దాడితే యింతిలాగ నా చెంప పగలగొడుతుందా?

పరిపరివిధాలుగా పోతోంది మనస్సు. నొప్పిగా వున్న చెంపనోసారి తడుముకున్నాను. లావణ్య అన్న మాటలు గుర్తొచ్చేయి.

"మరీ ముద్దొస్తున్నావోయ్!" అంది కాని, కమ్మని ఆ స్వరంతో "ముద్దిస్తానోయ్ బావా!" అనకూడదా? ఆవిడ మూటేం పోయిందో? అయినా ఆడవారి మాటలకు అర్థాలు వేరంటారు కదా అని కాస్త అడ్వాన్సయ్యా. ప్చ్! ప్చ్!

నా అంతరంగంలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. అలా యెప్పటికో... కలతగా... మగతగా... వో కునుకు పట్టేసింది. కనురెప్పలు బలవంతంగా మూసుకుపోతున్న ఫీలింగు నాలో.



ఉలిక్కిపడి లేచాను.

నా గది తలుపులు నెమ్మదిగా యెవరో తెరిచి లోపలికొస్తున్నారు. ఆ అడుగుల చప్పుడు మెలమెల్లగా వినిపిస్తోంది. అడుగులు అలా అలా నా 'బెడ్' దగ్గరగా వచ్చి ఆగేయి. ఎవరో మెల్లగా నా మీదకు వంగుతున్నారు!

కమ్మని పరిమళం వస్తూందా వ్యక్తి నుంచి. ఆవి మల్లెలా, సంపెంగలా? ఓ తీయని పిల్లతెమ్మెర కిటికీ లోంచి చల్లగా తగిలినట్లు ఆ ఆకారం ఊపిరి తగుల్తోంది నాకు. కనురెప్పలు తెరచి చూద్దామని ప్రయత్నించేను.

ఊహూఁ! తెరవలేకపోతున్నాను.

ఊపిరి మరింత చల్లగా నా ముఖానికి తగిలింది. ఆ వూపిరిలో కమ్మని అనురాగం, హాయినిచ్చే వెచ్చదనం!

టక్కున నా పెదాల మీదనో ముద్దు!

బుగ్గల మీదనో ముద్దు!

నొసటి మీదనో ముద్దు!... ముద్దుల వర్షం కురిసింది!

ఉక్కిరిబిక్కిరయ్యాను.

టక్కున పూర్తి తెలివొచ్చేసింది. కళ్లు తెరిచి చూసి, ఆశ్చర్యపోయేను.

నా బెడ్ దగ్గరే, నాకు మరింత దగ్గరగా లావణ్య!

ఆమె కనుకొలకుల్లో కన్నీటి బిందువులు...!

ఆ అందమైన చెక్కిళ్ల పైనుంచి కిందికి జారుతున్నాయి. ఆమె శరీరం చిన్నగా కంపిస్తోంది. అది నాకు తెలుస్తోందా సమయంలో.

"నా పిచ్చి మొద్దును, ప్రేమగా దగ్గరకు లాక్కున్న నిన్ను చెంప వాయగొట్టేను. నేను పాపిని. బండరాయిని!" దుఃఖంతో లావణ్య గొంతు మూసుకుపోయింది.

"ఏయ్...!" అన్నానో లేదో, విసురుగా వచ్చి నా పైన వాలిపోయింది లావణ్య.

"నీ చేత చెంప దెబ్బ తినబట్టే కదా జ్వరం వచ్చేసింది! జ్వరం రాబట్టే కదా నువ్విలా నా దగ్గరకొచ్చి, తీయతీయని ముద్దుల్ని ప్రసాదించేవు! ప్లీజ్ లావణ్యా! మళ్లీ మరోసారి నీ చేత్తో యివతలి చెంప కూడా పగలగొట్టవూ?" మారాం చేస్తూ అడిగేను.

లిప్తకాలం నా వంక చూసిందామె. ఆమె కళ్లలో కదిలే ప్రేమతరంగాలు వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి నన్ను.

"నిన్నిలా వదిలేస్తే లాభం లేదోయ్ బావా! పైత్యం పెరిగిపోతుంది. నిన్నేం చేస్తానో చూడు!" అంటూ నన్ను మరింత బలంగా, గాలి కూడా మా మధ్య చొరబడలేనంతగా హత్తుకుపోయింది లావణ్య. ■

# పట్టాలు తప్పిన బాల్యం



శ్రీ బాలభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీధి బాలల రాత్రి వసతిగృహం ఆనందనిలయంలో ఆనందంగా నర్తిస్తున్న వీధిబాలలు.

ఏ రైలెక్కినా, అది విజయవాడా, ఏలూరూ ప్యాసింజరు కావచ్చు. చెన్నై నిజాముద్దీన్ సూపర్‌ఫాస్ట్ పూర్తి ఏసీ ఎక్స్‌ప్రెస్ కావచ్చు. జనరల్ బోగీ కావచ్చు. స్లీపరు కోచ్ కావచ్చు, ఇంకా ఏసీ ఫస్ట్‌క్లాసూ కావచ్చు.... మౌనంగా రైలు పెట్టెలోని నేలని ఈతాకుల చీపురుతోనో, మురికిగుడ్డతోనో శుభ్రం చేసి, నిశ్శబ్దంగా అరచేతిని చాపి కళ్లలోకి ఆశతో చూసే పిల్లలు కనపడక తప్పరు.

"ఫోరాఫో" ఇది వాళ్లకి సుప్రభాతం.

"యెదవ్వాసనా...అవుతారవూ ...జరుగు జరుగు" ఇది వాళ్లకు బ్రేక్‌ఫాస్టు.

"ఏదైనా పనిచేసుకు చావచ్చుగా" ఇది వాళ్లకి మార్నింగ్ చాయ్.

"కనిపారేసిన ఎదవల్ని అనాలి" ఇది వాళ్లికి ఎవ్విరిడే లంచ్.

పిల్లలు బిస్కెట్లు తింటుంటే నేలమీద పడ్డ చిన్న చిన్న ముక్కలూ, అటూ ఇటూ గాలికి జారిపడ్డ వేరుసెనక్కాయలూ, అక్కడో పావలా, ఇక్కడో అర్థా...ఇదీ వాళ్ల ఆదాయం. రోజంతా ఇలా తిరిగినా ఆ వచ్చే ఐదో పదో కాజెయ్యడానికి పాపం 'సొంతపొట్ట'..మరి నా మాటో..అంటూ స్వాహా చేసేస్తుంది. దీపాలు వెలిగే వేళకు అరిగిన ఈతాకు చీపుళ్లూ, మురికిగుడ్డలూ, రైలెక్కుతూ దిగుతూ వుండే కంగార్లో ఈ రోజు కొత్తగా తగిలిన దెబ్బలూ వీళ్ల బాలెన్స్ షీట్.




శ్రీబాలభారతి ఆధ్వర్యంలో కలక్టర్ ఆఫీసు ముందు వీధిబాలల ప్రదర్శన.

ఎప్పుడూ కరకరా ఆకలితో మండుతూండే పొట్టా, ఏ క్షణాన ఎవరి తన్నులకీ, తిట్లకీ గురికావల్సి వస్తుందో అనే భయమూ, వీళ్లకి పుట్టుకనించే వచ్చిన కులమతాలు.

ఎవరు వీళ్లు?

ఒక విధంగా చూస్తే వీళ్ల చిరునామా కష్టమే! అయితే వాళ్లలో పెద్దవాళ్లు చెప్పిందాన్ని బట్టి చూస్తే ఒకింత అద్భుతమే!

సంపన్నులూ, ఇంట్లో సుఖం లేనివాళ్లూ లేదా ఇంటికి దూరంగా వున్నవాళ్లూ రైలు పెట్టెల్లో రిటైరింగు రూముల్లో అక్రమంగా ఒకసారి తమ ఆకలిని భయంభయంగా అతి హేయంగా నీచాతినీచంగా తీర్చుకుంటే, దానికి ప్రతిరూపంగా వద్దువద్దనుకుంటూ కన్నతల్లుల బిడ్డలు వీళ్లు.

పుట్టిన ఓ నెలా రెణ్నెల్ల వరకూ సాకి, ఆ మీదట అన్నం కోసం కుదురిన భర్తకి, రోజువారీ పొందు రుసుమిచ్చి ప్లాట్‌ఫారాన్నే పురిటిబిడ్డడికి పుట్టింటినిచేసి, ఇప్పుడే వస్తా అని పెద్దగా వాడితో చెప్పి, కదిలే